
www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 17 డిసెంబర్ 2024
5
తిరుపతి




ఏకలవ్య ఎరుకుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా ఈశ్వరమ్మ

ప్రజాశక్తి - రేణిగుంట



తిరుపతి జిల్లా ఏకలవ్య ఎరుకుల సంక్షేమ సంఘం తిరుపతి రూరల్ – రేణిగుంట మండలాల ప్రాంతీయ జనరల్ బాడీ సమావేశం ఆదివారం రేణిగుంట శ్రీ గంగమ్మ తల్లి గుడి ప్రాంగణం వద్ద జరిగింది. రాష్ట్ర అధ్యక్షులు దినిరి ప్రభాకర్, తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి హరినాథ్ సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా గాడి సిద్ధరామయ్య, అధ్యక్షులుగా మేంద్రగుత్తి చీరాలయ్య, ఉపాధ్యక్షులుగా రొద్దా మునిస్వామి, చిట్టేటి సులోచన, సహాయ కార్యదర్శిగా గోళ్ల వెంకటరమణ, కిల్లా యశ్వంత్, ప్రధాన కార్యదర్శిగా కొండ్రెడ్డి ఈశ్వరమ్మ, కోశాధికారి రొద్దా రాధికను ఎన్నుకున్నారు.

బిల్లుల మో(వా)త



జిల్లా ప్రజలపై భారీగా విద్యుత్ చార్జీల భారం
డిస్కం పరిధిలో రూ.2,872 కోట్లు భారం
తిరుపతి జిల్లాలో ఈనెల రూ.76 కోట్లు వసూలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

జిల్లా వాసులపై కూటమి ప్రభుత్వం రెండోసారి భారీ విద్యుత్ చార్జీల భారం పడింది. రూ.76 కోట్లు ఇంధన సర్దుబాటు చార్జీలను ప్రభుత్వం ప్రజల నుంచి వసూలు ప్రారంభించింది. డిస్కం పరిధిలో (తొమ్మిది జిల్లాల పరిధిలో) రూ.2,872 కోట్లు భారం పడిందని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రతి యూనిట్‌కు 61 పైసలు చొప్పున అదనపు భారం మోపింది. 2022 ఏడాది ఏప్రిల్ నెలలో వాడిన విద్యుత్ యూనిట్లకు సంబంధించి ఇంధన సర్దుబాటు చార్జీలు(ఎఫ్‌పీపీసీఏ) పేరుతో డిసెంబర్ నుంచి వసూలు ప్రారంభించింది. ఒక్కో యూనిట్‌కు రూ.1.21 చొప్పున వసూలు చేయాలని నిర్ణయించారు. అయితే ఇది ఎక్కువ మొత్తం అవుతోంది, బిల్లు భారీగా పెరిగే అవకాశం ఉండటం, ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తే అవకాశం ఉండటంతో దొడ్డిదారి ప్రయత్నాలను చేసింది. ఎఫ్‌పీపీసీఏ చార్జీలను రూ.1.21 ఒకేసారి కాకుండా, ఈ నెల 61 పైసలు, మరో నెల 60 పైసలు చొప్పున దానిని విడగొట్టింది. దీంతో ఈ నెల బిల్లులో 2022 ఏప్రిల్ నెలలో వాడిన విద్యుత్ యూనిట్లకు సంబంధించి యూనిట్‌కు 61 పైసలు చొప్పున ఈ డిసెంబర్ బిల్లులో వినియోగదారులకు వచ్చింది. అంటే యూనిట్‌కు 61 పైసలు చొప్పున జిల్లా పరిధిలో ఈ నెల అదనంగా రూ.76 కోట్లుకు పైగా వసూలు చేస్తున్నారు. తర్వాత నెల 60 పైసలు చొప్పున రూ.72 కోట్లు వసూలు చేయనున్నారు. మొత్తంగా ఎఫ్‌పీపీసీఏ ద్వారా జిల్లా ప్రజలపై రూ.148 కోట్లు భారం ప్రభుత్వం మోపింది. 2024 నవంబర్ నెల నుంచి వస్తున్న సర్దుబాటు చార్జీలకు ఇవి అధనం.

ప్రతి నెలా సర్దు'పోటు'...

ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ అడ్జస్‌మెంట్(ఎఫ్‌పీపీసీఏ) కింద ఇప్పటికే జిల్లా ప్రజలపై కూటమి ప్రభుత్వం కోట్లలో భారం మోపింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంధన సర్దుబాటు పేరుతో ప్రతి నెలా వడ్డనకు తెరలేపుతున్నారు. ఇప్పటికే ఎఫ్‌పీపీసీఏ పేరుతో గత నవంబర్ నెలలోనే యూనిట్‌కు 91 పైసలు చొప్పున వడ్డిస్తున్నారు. ఇలా ప్రతి నెల దాదాపు రూ.89 కోట్లను వసూలు చేస్తున్నట్లు విద్యుత్ అధికారుల లెక్కలు చెపుతున్నాయి. ఇలా గత ఐదు నెలల్లో జిల్లా వాసులపై దాదాపు రూ.734 కోట్ల భారం వేశారు.

తిరుపతి నగరానికి చెందిన రాజేశ్వరి (పేరు మార్చడం జరిగింది) గత నెల అందించిన విద్యుత్ బిల్లులో మొత్తం 101 యూనిట్ల విద్యుత్ వాడకం జరిగిందని, బిల్లు మొత్తం రూ.493 వచ్చింది. ఇందులో విద్యుత్ వాడకం కింద రూ.309, మినిలిన రూ.184లు వివిధ చార్జీల కింద వసూలు చేస్తున్నారు. ఇందులో కొత్తగా ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో సెప్టెంబర్, 2024లో వాడిన విద్యుత్ యూనిట్లకు రూ.60లు అదనంగా వడ్డించారు. ట్రూఅప్ చార్జీలు రూ.27లు, సర్‌ఛార్జీ రూ.25, కస్టమర్ చార్జీలు రూ.45, ఫిక్స్‌డ్ చార్జీలు రూ.20, ఎలక్ట్రిసిటీ డ్యూటీ కింద మరో రూ.6లు ఇలా...మొత్తంగా రూ.184లను వడ్డించారు.

ఈనెల వచ్చిన బిల్లులో 89 యూనిట్లకు గాను రూ.416 బిల్లు వచ్చింది. తక్కువ యూనిట్లు వాడినా, తక్కువ శ్లాబులో ఉన్నా కూడా ఎందుకు అంత బిల్లు వచ్చిందని అని పరిశీలించగా, గత నెలలో వచ్చిన బిల్లుకు అదనంగా మరో సర్దు'పోటు' ప్రభుత్వం వడ్డించింది. 2022 ఏప్రిల్ నెలలో వాడిన విద్యుత్ యూనిట్లకు సర్ధుబాటు పేరుతో రూ.22.76 లను అదనంగా భారం మోపారు. యూనిట్‌కు 61 పైసలు చొప్పున వీటిని వినియోగదారులపై వేశారు.

'టిడ్కో' దా'రుణాలు'

- ఇళ్ల లబ్ధిదారులపై బ్యాంకర్ల ఒత్తిడి
- కేటాయించకనే డిమాండ్ నోటీసులు

ప్రజాశక్తి - డక్కిలి

వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో వందలాది మంది లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు ఇంకా అందనే లేదు. అయితే రుణాలు కట్టాలంటూ బ్యాంకుల నుంచి డిమాండ్ నోటీసులు వస్తున్నాయి. ఇళ్లే చేతికి రాకుండా బ్యాంకులకు రుణాలు ఎలా కడతామంటూ లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ఇళ్లు చేతికొచ్చే వరకూ ఆగాలని ప్రాధేయపడుతున్నా బ్యాంకులు వినడం లేదు. రుణాలు కట్టకపోతే సిబిల్ స్కోర్ తగ్గుతుందంటూ బెదిరిస్తుండటం గమనార్హం.

వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో పేద, మధ్య తరగతి వర్గాలకు కిందటి టీడీపీ ప్రభుత్వం తలపెట్టిన బహుళ అంతస్థుల సముదాయాలతో కూడిన టిడ్కో ఇళ్ల నిర్మాణం ప్రహసనంలా మారింది. 2014 – 19 హయాంలో టిడిపి ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టి వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో సుమారు 2400 మందికి టిడ్కో ఇళ్లను మంజూరు చేసి నిర్మాణాలను ప్రారంభించింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం టీడిపి హయాంలో నిర్మాణం మొదలుపెట్టిన ఆ ఇళ్లను పూర్తిగా పక్కన పెట్టేసింది. తమ హయాంలో టిడ్కో ఇల్లు పునాదుల నుంచి నిర్మించిన 1008 మంది లబ్ధిదారులకు అందజేశారు. దీంతో టిడిపి హయాంలో నిర్మాణం ప్రారంభించిన లబ్ధిదారులు ఇళ్ల కోసం ఏడేళ్లుగా ఎదురుచూస్తూనే ఉన్నారు. ఇళ్ల రూపం కనిపిస్తున్నా అందులో నివాసయోగ్యమైన సదుపాయాలు మాత్రం లేవు. ఇక రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్, మంచినీటి వసతులు వంటివేం లేవు. 'బ్యాంకుల్లో రుణాలిప్పిస్తాం.. తామిచ్చిన పట్టాలు తాకట్టు పెట్టి రుణాలు తీసుకోండి.. ఆ డబ్బు మాకు అప్పగించండి.. నెల రోజుల్లో అన్ని సదుపాయాలు కల్పించి ఇళ్లు మీకు అందజేస్తాం..' అంటూ రెండేళ్ల క్రితం అప్పటి వైసీపీ ప్రభుత్వం లబ్ధిదారుల పేరిట రుణాలు తీసుకుంది. తీసుకున్న రుణాలకు ఈఎంఐలు ఇళ్లు స్వాధీనమయ్యాక చెల్లిస్తే సరిపోతుందని నమ్మబలికారు. ఇది జరిగి రెండు, మూడేళ్లు అవుతున్నా ఇంటి పట్టాలైతే బ్యాంకుల చేతికి వెళ్లాయి కానీ, ఇళ్లు మాత్రం ఇంతవరకు అందలేదు. ఇంతలోనే పిడుగుపాటులా బ్యాంకులు రుణాలు చెల్లించాలంటూ డిమాండ్ చేస్తూ బ్యాంకుల నుంచి ఫోన్లు, మెసేజ్‌లు వస్తున్నాయి. ఇళ్లు చేతికి అందకుండా రుణాలు కట్టడమేంటని లబ్ధిదారులు బ్యాంకర్లను ప్రశ్నిస్తున్నారు. ఇళ్లలోకి వెళ్లిన 24 నెలల తర్వాత బ్యాంకులకు వాయిదాలు చెల్లిస్తారని చెప్పిన మేరకు, తమ గడువు ప్రకారమే నోటీసులు ఇస్తున్నామని బ్యాంకర్లు చెబుతున్నారు. ఇళ్లు ఇంకా పూర్తి కాలేదని, తమకు అందలేదని లబ్ధిదారులు చెబుతున్నా.. సమయం ఎప్పుడో దాటిపోయిందని, రుణాలు చెల్లించాల్సిందేనని బ్యాంకర్లు తెగేసి చెబుతున్నారు. ఇదే విషయాన్ని స్థానిక



మున్సిపల్, టిడ్కో అధికారుల దష్టికి తీసుకెళ్తే బ్యాంకులకు డబ్బు చెల్లించాల్సిన అంశాన్ని ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లామని కొత్తగా ప్రభుత్వం ఏర్పాటైనందున త్వరలో బ్యాంకులకు చెల్లింపులు చేస్తామని చెప్తున్నారు . వ్యక్తిగతంగా రుణాలు అవసరమై సిబిల్ స్కోరు సమస్య ఉన్న లబ్ధిదారులు బ్యాంకర్ల సూచన మేరకు కొంత మొత్తంలో చెల్లించాలని సూచిస్తున్నారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు ఫోన్లు చేస్తున్న బ్యాంకర్లు సిబిల్ స్కోర్ తగ్గుతుందని బెదిరిస్తున్నారు.

ఏళ్ల తరబడి అగమ్యగోచరమే..

వెంకటగిరిలో 2014-19 టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. తొలి విడతలో అప్పటి టీడీపీ ప్రభుత్వం 2400 ఇళ్ల కు గానూ 1500 ఇళ్ల నిర్మాణ పనులు తలపెట్టారు. దాదాపు వేయికుపైగా ఇళు నిర్మాణం పూర్తి చేసుకుని తుది మెరుగులు దిద్దుకోవటానికి సిద్ధమ య్యాయి. వైసీపీ వచ్చాక ఆ ఇళ్ల నిర్మాణ పనులు మూలన పడ్డాయి. తాము కొన్ని ఇళ్ల నిర్మాణ పనులు తలపెట్టి వాటిని మాత్రమే పూర్తి చేసి లబ్దదారులకు అందచేశారు. టీడీపీ హయాంలో పనులు తలపెట్టిన ఇళ్ల నిర్మాణ పనుల్లోపురోగతిలో లేదు. టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు వైసీపీ ప్రభుత్వం బ్యాంకుల వద్ద డబ్బు తెచ్చి గల్లాపెట్టెలో వేసుకుంది. కానీ, ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయకపోవటంతో తీసుకున్న రుణాలను కట్టాల్సిందిగా బ్యాంకులు లబ్ధిదారులపై పడుతున్నారు. ఇప్పటికైనా టిడిపి ప్రభుత్వం హయాంలో నిర్మాణ పనులు తలపెట్టిన ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

అదానీ అవినీతిపై నోరు మెదపరేం : సిపిఎం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి,గూడూరు టౌన్

అదానీ విద్యుత్ కుంభకోణంపై కేంద్రంలోని బిజెపీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు ఎందుకు నోరు మెదపడం లేదని సిపిఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి ప్రశ్నించారు. సెకీ ఒప్పందంలో బయటపడ్డ రూ. 1700 కోట్ల కుంభకోణంపై విచారణ ఎప్పుడు చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీల పెంపుకు వ్యతిరేకంగా శ్రీకాళహస్తి పట్టణంలో సోమవారం సిపిఎం నాయకులు నిరసన తెలిపారు. గంధం మణి మాట్లాడుతూ ప్రజలపై ట్రూ అప్, సర్దుబాటు చార్జీల భారం మోపద్దని సూచించారు. సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదానీ కుంభకోణంపై బీజేపీ, టీడీపీ, వైసీపీ, జనసేనలు నోరు మెదపడం లేదంటే, వారికీ అందులో వాటాలున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని విమర్శించారు. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విద్యుత్ సంస్కరణలు మానకుంటే దేశవ్యాప్త ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, వెంకటేష్, కేశవమ్మ, నాగరాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలని ధర్నా

ఎన్నికలకు ముందు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పిన కూటమి నేతలు, అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లకే ట్రూఅప్ ఛార్జీల పేరిట భారాలు మోపడం సరికాదని, స్మార్ట్ మీటర్లను బిగించరాదని డిమాండ్ చేస్తూ సిపిఎం, సిఐటియు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలిపారు. పెంచిన కరెంట్ బిల్లులను తగలబెట్టి నిరసన తెలిపారు. మీటర్లు వద్దని హైకోర్టులో కేసు నడుస్తోందని, అధికారంలోకి రాగానే మాట తప్పి 15,484 కోట్ల సర్దుబాటు ఛార్జీల భారం మోపడం సరికాదన్నారు. ప్రస్తుతం బిగిస్తున్న మీటర్లు 'స్మార్ట్ బాంబ్' అని ఎద్దేవా చేశారు. దీనివల్ల నెలనెలా బ్యాలెన్స్ ఛార్జి చేసుకోవాల్సి ఉంటుందన్నారు. సిపిఎం నాయకులు జోగి శివకుమార్, డి.వెంకట్రామిరెడ్డి, ఇ.శ్రీనివాసులు, బివి రమణయ్య, ఎస్.సురేష్ పాల్గొన్నారు.

ఏనుగుల బెడదతో రోడ్డెక్కిన రైతులు

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు

ఒకరోజు రెండు రోజులు కాదు ఏకంగా నెలరోజులుగా భాకరాపేట, ఎగవూరు, దిగవూరు పరిసర ప్రాంతాల్లో ఏనుగుల గుంపు రైతులకు కునుకు లేకుండా చేస్తున్నాయి. దీంతో అన్నదాతలు భాకరాపేట రహదారిలో రోడ్డెక్కారు. పొలాల్లోకి ఏనుగుల రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలంటూ ధర్నా చేశారు. ఈ పరిసరాల్లో చెరకు, వరి, టమాట, అరటి తదితరాలు సాగు చేస్తున్నారు. ఏనుగులకు కావలసినంత మేత దొరుకుతుండడంతో ఈ ప్రాంతం వదిలి వెళ్ళడంలేదు. రోజూ ఎక్కడో ఒకపక్క పంటలపై పడి ధ్వంసం చేస్తూనే వున్నాయి. లక్షలాది రూపాయల పంట నష్టంతో పాటు ముళ్ల కంచెలు, పైపులు, మోటార్లను సైతం పెకలించి తీవ్ర నష్టాలను మిగిల్చడంతో రైతులు కుదేలయిపోయారు. షరిష్కార మార్గం చూపాలని ఫారెస్టు అదికారులకు ఎన్నిసార్లు విన్నవించినా వారి ఆవేదన అరణ్యరోదనే అయ్యింది. అడవి దగ్గరే వుంది కదా అందులోకి తరమండని మేము సహకరిస్తామని ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేదన్నారు. వారు పట్టించుకోక పోవడంతో చేసేదిలేక రోడ్డెక్కవలసి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబదిత అదికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ మేరకు డిఎఫ్ఒకు వినతిపత్రం అందజేశారు.

శాశ్వత పరిష్కారం చూపాలి : రైతుసంఘం

చిన్నగొట్టిగల్లు మండలం రొంపిచెర్ల మండలాల్లో ఏనుగులు గుంపులు గుంపులుగా స్వైరవిహారం చేస్తున్నాయని, వాటిని అడవిలోకి తరిమేసి, శాశ్వత ప్రాతిపదికన కందకాలు తవ్వాలన్నారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి హేమలత డిమాండ్ చేశారు. రైతులు కష్టపడి పండించిన పంటను తొక్కి నాశనం చేస్తున్నాయన్నారు. దీంతో ఆరుగాలం కష్టపడి పండించిన అన్నదాత అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారన్నారు. కర్నాటక కుంకీలను రప్పించి ఏనుగులను అడవిలోకి పంపుతామని చెప్పిన మంత్రి, ఆరు నెలలైనా పట్టించుకోలేదన్నారు. నష్టపరిహారాన్ని పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు టైం స్కేల్ ఇవ్వాలి

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్. నర్సింగరావు



ప్రజాశక్తి - క్యాంపస్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, ఆప్కాస్, వర్క్ కాంట్రాక్టు తదితర రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగస్తులు అందరికీ టైం స్కేల్ అమలు చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి. హెచ్. నర్సింగరావు డిమాండ్ చేశారు. తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో సమగ్రశిక్ష, స్విమ్స్, బర్డ్, రుయా హాస్పిటల్, ఎస్వీయూ, వేదిక్, వెటర్నరీ, అగ్రికల్చర్ యూనివర్సిటీ, 108, 104, ఎలక్ట్రికల్, ఫారెస్ట్, టీటీడీ అన్నమాచార్య, ఎన్. హెచ్.ఎం తదితర రంగాల ఉద్యోగుల సమావేశంలో సి. హెచ్. నర్సింగరావు మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలలో, సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఆప్కాస్, వర్క్ కాంట్రాక్ట్, కంటిజెంట్, పార్ట్ టైం, గెస్ట్, పీస్ రేట్, గౌరవ వేతనం తదితర పేర్లతో తక్కువ వేతనాలు చెల్లిస్తూ వారి శ్రమను దోపిడీ చేస్తున్నారన్నారు. నాన్ రెగ్యులర్ ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు, సౌకర్యాలు అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి టైం స్కేల్ అమలు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సదస్సులు నిర్వహించి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. సిఐటియు తిరుపతి జిల్లా ప్రధానకార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ సొసైటీలు, యూనివర్సిటీలు, స్థానిక సంస్థలు, టీటీడీ వంటి ధార్మిక సంస్థల్లో నాన్ పర్మినెంట్ కార్మికులు, ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్. జయచంద్ర, ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షుడు చినబాబు, ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గండికోట నాగ వెంకటేష్ మాట్లాడుతూ ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని కోరారు. అన్ని సంక్షేమ పథకాలు అమలు చేసి ఎక్స్ గ్రేషియాను రూ.20 లక్షలకు పెంచాలన్నారు. మరణించిన ఉద్యోగుల కుటుంబాలను ఆదుకునేందుకు కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవులు మంజూరు చేయాలని, 10 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్, గ్రాట్యూటీ కల్పించాలని చెప్పారు. వ్యవసాయ కళాశాల నేతలు వరలక్ష్మి, సుబ్బరత్నమ్మ, టీటీడీ కాంట్రాక్టు సూపర్వైజర్స్ నాయకులు రఘు, రుయా నరసింహులు, లక్ష్మీనారాయణ, వెటర్నరీ యూనివర్సిటీ నాయకులు సుభాన్, 104 యూనియన్ అధ్యక్షులు అమర్నాథ్, జూ పార్క్ ఉద్యోగులు కార్యదర్శి ఈశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్‌పై క్రమశిక్షణా చర్యలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా పని చేసి బదిలీపై చిత్తూర్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ పనిచేస్తున్న బి చంద్రశేఖర్ పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని మున్సిపల్ శాఖ చీఫ్ సెక్రటరీ కన్నబాబు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్థిక లావాదేవీల్లో స్పోండర్ వాహనం సంబంధించిన వివరాలు వార్షిక ఆదాయంలో ఇవ్వకపోవడమే కాకుండా వారికి సహకరించకపోవడంతో ఏసి బి ఉన్నతాధికారులు మున్సిపల్ ప్రధాన కార్యదర్శి కి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి చంద్రశేఖర్ సరైన వివరాలు ఇవ్వడంలేదని ఫిర్యాదు చేస్తూ ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు . అలాగే సి.గోపాల్ రెడ్డిపైనా అభియోగాలు రావడంతో నెల్లూరు పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ గా పనిచేస్తున్న టీ.మోహన్‌ను విచారణ అధికారిగా నియమించారు.

'డయల్ యువర్ కమిషనర్'ను పునరుద్ధరించాలి : ఐద్వా

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

పుర ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న 'డయల్ యువర్ కమిషనర్' కార్యక్రమాన్ని పునరుద్ధరించాలని ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.జయంతి, పి.సాయిలక్ష్మి డిమాండ్ చేశారు. గతంలో ప్రతి సోమవారం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకూ డయల్ యువర్ కమిషనర్ జరిగేదని, పారిశుధ్యం, డ్రైనేజీ, రోడ్లు, కలుషిత తాగునీరు సమస్యలను ఫోన్‌లో తెలియజేస్తే, కొన్నైనా పరిష్కారం అయ్యేవన్నారు.

కొత్తపల్లి డ్రైనేజీ కాల్వపై గోడ నిర్మించాలి

తిరుపతి టౌన్ : లీలామహల్ నుంచి కరకంబాడి వెళ్లే ప్రధాన రోడ్డులో ఉన్న డివైడర్‌పై ముళ్లకంపలను, పిచ్చి మొక్కలను తొలగించి, కొత్తపల్లి డ్రైనేజీ కాల్వపై గోడ నిర్మించాలని సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.సుబ్రమణ్యం, నగర కార్యదర్శి కె.వేణుగోపాల్ మాట్లాడుతూ డివైడర్‌పై దాదాపు నాలుగు కిలోమీటర్ల పొడవునా పిచ్చిమొక్కలు పెరిగాయన్నారు. వీధిలైట్లు సైతం లేకపోవడంతో రాత్రుల్లో పాములు, విష పురుగులు ఇళ్లల్లోకి వస్తున్నాయన్నారు. నాయకులు ఎం.నరేంద్ర మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది లేని ప్రాంతానికి చేపల మార్కెట్‌ను మార్చాలన్నారు. ఈ కార్యక్రమంలో పి. బుజ్జి, ఎం.జయంతి, ఆర్.మల్లికార్జునరావు, రమేష్, ప్రభాకర్, పి.సాయిలక్ష్మి, చిన్నబాబు, రామకృష్ణ, తంజావూరు మురళి పాల్గొన్నారు.



వరద నీటిలో మునిగి ఉన్న వరినాట్లు

వీడని వరద వ్యధ

- మళ్లీ అల్పపీడన ప్రకటన
- నీళ్లలోనే వరినారు మునక

ప్రజాశక్తి - డక్కిలి

జిల్లాలో వరిసాగు చేస్తున్న రైతుల నారుమడులను, నాట్లను భారీ వానలు, వరదలు ముంచెత్తుతున్నాయి. కుండపోతగా కురుస్తున్న వర్షాలతో అన్నదాతలకు ఆదిలోనే కష్టాలు తప్పడం లేదు. నెలరోజుల క్రితం వర్షం కోసం ఎదురు చూసిన రైతులు... ఇప్పుడు ఏ క్షణం ఏ కట్ట తెగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఉప్పొంగుతున్న వరదలు పంటను ముంచి.. ఆశలు తుంచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు అనుకున్న సమయానికి కురవడంతో ఈ ఏడాది రైతులు ఉత్సాహంగా సాగును ప్రారంభించారు. దుక్కులు దున్నుకుని వరి నారుమళ్లను సిద్ధం చేసుకునీ పది రోజుల నుంచి వెంకటగిరి నియోజక వర్గం లోని వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి, ధరాపూరు, సైదాపురం, కలవాయి మండలాల్లో ముమ్మరంగా వరి నాట్లు పనుల్లో రైతాంగం బిజీబిజీగా ఉన్నారు. అయితే ఈనెల 12వ తేదీన ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లుగా ఏకధాటిగా కురిసిన వర్షాలకు రైతులు వణికిపోయారు. కాలువలు, వాగులు పొంగి పొర్లుతుండడంతో వేల ఎకరాల్లో వరి, ఉద్యాన పంటలు ముంపు బారినపడ్డాయి. నారుమడులను, నాట్లను భారీ వానలు, వరదలు ముంచెత్తుతున్నాయి. సాగు భూముల్లో అడుగు లోతు నీరు చేరిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో రైతులు నష్టపోయే పరిస్థితులు ముఖ్యంగా వరి పండించే రైతులు ఎదుర్కోనున్నారు. ఎప్పుడు ఏ వరద ముంచెత్తి గుండెకోతకు గురి చేస్తోందో తెలియక ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మినుము పంటలు వర్షానికి పాడయ్యాయి. ఎడతెరిపి లేని వర్షాలతో నియోజకవర్గంలో వరిచేలు చెరువులను తలపిస్తున్నాయి. కూరగాయల పంటలను వర్షపు నీరు ముంచెత్తింది. వరినాట్లు పడిన చోట ఎకరాకు రూ.20 వేల పైచిలుకే పెట్టుబడి పెట్టారు. మరో రెండ్రోజులు భారీ వర్షాలు కురిస్తే అంతా పోయినట్లేనని రైతులు చెబుతు న్నారు

స్టేడియం పనులు వేగవంతం చేయాలి : శాప్ ఛైర్మన్

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో చేపడుతున్న ఖేలో ఇండియా మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం పనులను వేగవంతం చేయాలని, సకాలంలో పూర్తిచేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ, శాప్ నిధులతో చేపడుతున్న ఇండోర్ స్టేడియం పనులను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వి.ఉమ, రిజిస్ట్రార్ ఎన్.రజనీ, పీఈడీ ఎస్.సరోజినీ, డీస్డీఓ సయ్యద్ సాహెబ్‌లతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. నత్తనడకన సాగుతున్న స్టేడియం నిర్మాణం పట్ల అసహనం వ్యక్తం చేశారు. స్టేడియం నిర్మాణానికి పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు ముందుకు సాగకపోవడంతో కాంట్రాక్టర్ పనితీరుపై అసంతప్తి చెందారు. అనంతరం వీసీ ఛాంబర్‌లో స్టేడియం పనుల పురోగతిపై సమీక్షించారు. ముఖ్యంగా ఉడెన్ కోర్టును త్వరితగతిన పూర్తిచేయాలని, అలాగే ఖోఖో కోర్టుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. తద్వారా భవిష్యత్తులో వాలీబాల్, కబడ్డీ వంటి క్రీడలను కూడా నిర్వహించేందుకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తిరుపతి టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి మహేశ్ యాదవ్, టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు కొట్టే హేమంత్ రాయల్, తెలుగుయువత రాష్ట్ర నాయకులు రంజిత్ పాల్గొన్నారు.





యుద్ధప్రాతిపదికన రహదారి నిర్మాణం

శరవేగంగా 6లైన్స్ రహదారి పనులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

పూతలపట్టు – నాయుడుపేట జాతీయ రహదారి కనెక్టివిటీగా సి.మల్లవరం నుంచి తూకివాకం వరకూ 17 కిలోమీటర్ల దూరం నేషనల్ హైవే 71 రహదారి 'సిక్స్‌లైన్' పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఏడాదిలో పూర్తి చేయాలన్న లక్ష్యంగా నేషనల్ హైవే అథారిటీ ఎంచుకుంది. ఈ మేరకు రోడ్డు విస్తరణ పనులు సి.మల్లవరం నుంచి పేరూరు వకుళమాత సమీపం వరకూ జేసీబీలతో యుద్ధప్రాతిపదికన పనులు చేయిస్తున్నారు. 17 కిలోమీటర్ల దూరం ఉండే ఈ రహదారి ఫ్లైఓవర్‌గా రూపుదిద్దుకుంటుందా, లేదా ఎనిమిది అండర్ బ్రిడ్జి పనులు ఉన్న కారణంగా ఒంపులు ఒంపులుగా నిర్మాణం జరుగుతుందా?

బాలాజీ డెయిరీ సమీపంలో టోల్‌ప్లాజా

అన్నది అధికారులు నిర్ధారించాల్సి ఉంది. ఈ రోడ్డు పనులకు సంబంధించి కాంట్రాక్టును కాంట్రాక్టర్‌కు అప్పగించి ఏడాది గడువు విధించారు. అయితే బాలాజీ డెయిరీ సమీపంలో టోల్‌ప్లాజా వస్తుందని అధికారులు ఇంజినీరింగ్ మ్యాప్ చేశారు. ఈ మేరకు రోడ్డుకు ఇరువైపులా మార్కింగ్ చేసి, ఎర్రజెండాను పాతారు. ఇప్పటికే భూములు కోల్పోతున్న బాధితులు కొంతమంది కోర్టును ఆశ్రయించారు. మరికొంతమంది కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. ఏదిఏమైనప్పటికీ సిక్స్‌లైన్ రహదారి నిర్మాణం యుద్ధప్రాతిపదికన జరుగుతోంది.

దేశవాళీ విత్తనాలనే వాడండి

ప్రజాశక్తి - క్యాంపస్

సంపూర్ణ ఆరోగ్యానికి సమగ్ర ఆహారం అత్యవసరం. అయితే, రసాయనాలతో కలుషితమైన ఆహారం ఆరోగ్యానికి నష్టాన్ని కలిగిస్తుందని, ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న అనేక అనారోగ్య సమస్యల మూలకారణం రసాయనాలతో పెంచిన ఆహార పదార్థాలు వాడడం. ఈ సమస్యను అధిగమించడానికి సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయానికి మళ్లడం అత్యవసరమని ప్రాజెక్టు ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డా.నీరజ అన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రీయ ఉచ్చతర శిక్షణ అభియాన్ మంజూరు చేసిన ప్రాజెక్టులో భాగంగా రామచంద్రాపురం మండలంలోని సి.కె పల్లి గ్రామంలో మహిళలకు సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయం పైన మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ డా.పట్టాభిరెడ్డి, మండల టీమ్ లీడర్ విమల, మాస్టర్ ట్రైనర్ రంగయ్య పాల్గొన్నారు.

మాలల రాష్ట్ర సభలో మీజూరు మాధవ్

ప్రజాశక్తి - కోట

గుంటూరులో లక్షలాది మంది మాలలతో జరిగిన రాష్ట్ర సభలో ఉమ్మడి నెల్లూరు జిల్లా మాల ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఈదురు విజయకుమార్, అడ్వకేట్ మోహన్ అంబేద్కర్, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి (కోట కేంద్రం) అధ్యక్షులు మీజూరు మాధవ్ లకు సభావేదికపై అవకాశం లభించింది. కోటలో దాదాపు 20 పైబడి కమిటీలను వేయడం వల్లనే ఇది సాధ్యమయ్యిందని మీజూరు యాదవ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అవకాశం కల్పించిన అఖిల భారత మాలల జెఏసి ఛైర్మన్ దేవి ప్రసాద్, రాష్ట్ర మాల ఉద్యోగుల జెఏసి ఛైర్మన్ అశోక్‌బాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

బ్యూటీషియన్ కోర్సుపై శిక్షణ

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో పది రోజుల బ్యూటీషియన్ కోర్సు పై శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక వెంకటపతి నగర్ లోని మహిళలకు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టి.చైతన్య మాట్లాడుతూ ప్రస్తుతం ఎంతో ఆదరణ ఉన్న బ్యూటీషియన్ కోర్సు నేర్చుకోవాలని ఆసక్తి గల మహిళలకు ట్రైనింగ్ ఇవ్వడం వల్ల ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్న ఉద్దేశంతో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. డిసెంబర్ 25వ తేదీ వరకు శిక్షణ ఉంటుందని, ఈ అవకాశాన్ని ఆసక్తి ఉన్న మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి ట్రైనర్ కె.నిరోష, మహిళా అధ్యయన కేంద్ర ప్రాజెక్టు అసిస్టెంట్ ఎం. ఇంద్రాణి పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషిచేయాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర పరిశీలకులు రమేష్ పేర్కొన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, సర్పంచులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల సుస్థిరాభివృద్ధి ప్రతి ఒక్కరూ లక్ష్యాలను ఏర్పరచుకోవాలని పేర్కొన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించాలని సూచించారు. పారిశుధ్యం, త్రాగునీరు, పంచాయతీలు అభివృద్ధి వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు సమిష్టిగా కషిచేసి పంచాయతీలను అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదన్ రావు, డి ఎల్ పి ఓ వెంకటరమణ పాల్గొన్నారు.

ముస్లిం వీధిలో ఆక్రమణలు తొలగించాలి

ప్రజాశక్తి -కోట

ముస్లిం వీధిలో రహదారి ఆక్రమణలను తక్షణమే తొలగించాలని ఎంపీడీవో వై.వేణుకు స్థానికులు కొంతమంది వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం కోట మండలంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వై.వేణును ముస్లిం వీధి నివాసితులు మర్యాదపూర్వకంగా కలిసి ఆక్రమణలను గురించి వివరించారు. గతంలో ముస్లిం వీధిలో రాకపోకలకు ఎలాంటి అంతరాయం ఉండేది కాదని, ట్రాక్టర్లు, ఆటోలు సైతం రాకపోకలకు రోడ్డు అనుకూలంగా ఉండేదని, అలాంటి రోడ్డును ప్రస్తుతం పలువురు దుకాణాలును నిర్మించి వాటి ముందు కాలువలపై బండరాళ్లను నిర్మించడమే కాకుండా వారి వారి వాహనాలను రోడ్డుపైనే ఉంచడంతో మిగతావారు రాకపోకలు కొనసాగించాలంటే నానా రకాలుగా ఇబ్బందులు పడుతున్నామని ముస్లిం వీధి నివాసితులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎవరికైనా అనారోగ్యంగా ఉంటే అంబులెన్స్ వచ్చే పరిస్థితి కూడా లేదని వాపోయారు. ఎంపిడిఒ వేణు స్పందిస్తూ కోట పంచాయతీ కార్యదర్శి ఎన్.రాజశేఖర్‌ను ఆదేశించారు.

ప్రత్యేక ప్రతిభావంతులకు సాయం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ప్రత్యేక ప్రతిభావంతులకు విశిష్ట సేవలు అందిస్తున్న శ్రీ లక్ష్మీ నరసింహ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు సైదమ్మ(శైలజ)కు తిరుపతి మానవత శాఖ, రిటైర్డ్ ఎస్సై సుధాకర్ బాబు చే నెలకు సరిపడే బియ్యం, పప్పు ధాన్యాలు, ముడి సరుకులను ఉచితంగా అందజేశారు. సోమవారం వికతమాల సమీపం ఇందిరమ్మ ఇళ్ల వద్ద ఉన్న శ్రీ లక్ష్మీనరసింహ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంకు మానవతా సంస్థ ప్రతినిధులు రాళ్లపల్లి మాధవ నాయుడు, సుకుమార్ రాజు, భార్గవ, ఎంవి రమణ, సుధాకర్ బాబులు వెళ్లి పది బస్తాల బియ్యం, ఇతర ఆహారపు వస్తువులను ఉచితంగా అందజేశారు. ఈనెల 29న తిరుపతి యూత్ హాస్టల్ లో జరిగే వార్షికోత్సవ కార్యక్రమానికి మానవతా సభ్యులు హాజరు కావాలని కోరారు.

మూడో రైల్వేలైన్ అత్యవసరం : ఎంపి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రేణిగుంట - గూడూరు మధ్య మూడో రైల్వే లైన్ నిర్మాణం అత్యవసరమని ఎంపి మద్దిల గురుమూర్తి అన్నారు. పలు రైల్వే సమస్యలను పార్లమెంట్ జీరో అవర్‌లో గళమెత్తారు. పెరుగుతున్న రైల్వే ట్రాఫిక్ దృష్ట్యా రేణిగుంట - గూడూరు మధ్య మూడో రైల్వే లైన్ నిర్మాణం అత్యవసరమని తెలిపారు. పూడి, ఏర్పేడు మధ్య కొత్త రైల్వే లైన్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయడం ద్వారా స్థానిక ప్రాంతాల మధ్య కనెక్టివిటీ మెరుగవుతుందన్నారు. కోవిడ్ -19 సందర్భంగా ఎత్తేసిన స్టాపింగ్‌లకు సంబంధించి వెండోడు, నాయుడుపేట, సూళ్లూరుపేట స్టేషన్లలో పునరుద్ధరించాలని అభ్యర్థించారు. తిరుపతి - విశాఖపట్నం మధ్య వందేభారత్ స్లీపర్‌రైలు సేవలను అందించాలన్నారు. తిరుపతి నుంచి వారణాసి - అయోధ్యకు కొత్త రైలు సర్వీసులను ప్రారంభించాలన్నారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

బిఎన్‌కండ్రిగ : ద్విచక్రవాహనాన్ని నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సబ్‌ఇన్‌స్పెక్టర్ విశ్వనాథనాయుడు కోరారు. సోమవారం వాహనాల తనిఖీల్లో భాగంగా ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనదారులకు రక్షణ కవచంగా హెల్మెట్ ఉంటుందన్నారు. ప్రమాదాలు సంభవిస్తే కవచంలా ఉపయోగపడుతుందన్నారు. హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలువురికి జరిమానా విధించారు.

క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించాలి

ప్రజాశక్తి - బిఎన్ కండ్రిగ

క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా నివారణ సాధ్యమవుతుందని డాక్టర్ పవి దివాకర్ తెలిపారు. స్విమ్స్ ఆధ్వర్యంలో కంపాళెం, కారణిలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పింక్ బస్సుల్లో ఉచితంగా పరీక్షలు చేయించుకోవాలని కోరారు. బిఎన్ కండ్రిగ పిహెచ్ సి పరిధిలో డిసెంబర్ 17న కాటూరు, విఎస్.పురం, డిసెంబర్ 19న పల్లమాల, పార్లపల్లి, డిసెంబర్ 20న తలారివెట్టు, వెస్ట్ వరత్తూరు, డిసెంబర్ 23న ఆర్.అనంతపురంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ దివాకర్, డాక్టర్ విద్యాసాగర్, స్విమ్స్ శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పద్మావతి, డాక్టర్ చైతన్య భాను, సిహెచ్ఓ డిఎన్.వెంకటేశుపాల్గొన్నారు.



తక్షణ పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి -వరదయ్యపాలెం, కెవిబిపురం


తక్షణ పరిష్కారానికే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు సత్యవేడు నియోజకవర్గం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. సోమవారం యానాది వెట్టు గ్రామంలో ఏర్పాటు చేసిన రెవిన్యూ సదస్సులో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుండి అర్జీలను స్వీకరించి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం తొండంబట్టు ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజశేఖర్, వ్యవసాయ అధికారిణి గౌరీ , **ఎస్సై మల్లికార్జున్ పాల్గొన్నారు.**



కెవిబిపురం మండలంలో పూడి సికెపురంలో రెవెన్యూ సదస్సు సోమవారం జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్, మండల కార్యదర్శి నాగలాపురం నాగరాజు, ఎగువపూడి శాఖ కార్యదర్శి శంకరయ్యలతో కలిసి రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. దిగువపూడి, వడ్డిపాలెం, ఎగువపూడి, పోలినాయుడు కండ్రిగ గ్రామాలకు నది దాటాల్సి ఉండగా వర్షం వచ్చిన ప్రతిసారీ ఏరు దాటలేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆరోగ్య సమస్యలు తలెత్తితే ప్రాణం మీదకు వచ్చే ప్రమాదం ఉందన్నారు. తక్షణం హైలెవల్ బ్రిడ్జిని మంజూరు చేసి నిర్మించాలని డిమాండ్‌చేశారు. సర్వే నంబర్ 386, 387 లో గ్రామంలోని పేద రైతులకు ఇచ్చిన పట్టాలను 30 సంవత్సరాల గడుస్తున్నా ఇప్పటికీ భూములు చూపకపోవడం దారుణమన్నారు. ఎగువపూడి గిరిజనులు 20 మంది ప్రభుత్వ స్థలంలో పదేళ్లుగా గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారని, వారికి పట్టాలు ఇవ్వడంలో రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యం వహించారన్నారు. ఈ మేరకు తహశీల్దార్ మునిరత్నంకు వినతిపత్రం అందజేశారు.

దొరవారిసత్రంలో కల్లూరు, కల్లూరుకండ్రిగ గ్రామాల్లో సదస్సులు నిర్వహించినట్లు తహశీల్దార్ శైలకుమారి తెలిపారు. సర్పంచి పురుషోత్తం, మాజీ జడ్‌పిటిసి రత్నయ్య, విఆర్ఒ మధు, సర్వేయర్ నాగరాజు పాల్గొన్నారు.

లక్ష్యసాధనతోనే ఉన్నత శిఖరాలకు



ప్రజాశక్తి -రామచంద్రపురం

ప్రతి విద్యార్థీ కష్టపడి చదివి విజ్ఞాన అభివద్ధిని పెంపొందించుకొని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కమ్మ కండ్రిక గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు డాక్టర్ చేకూరి కోదండ రామానాయుడు అన్నారు. సోమవారం మండలంలోని మిట్టూరు గ్రామంలో ఉన్న చేకూరి నాగమనాయుడు ఎర్రమ్మల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యార్థి దశలోనే లక్ష్యాలను ఎంచుకొని, లక్ష్య సాధన కోసం నైతిక విలువలతో కూడిన విద్యను అలవర్చుకోవాలని కోరారు. విద్యార్థులు యోగా, వ్యాయామము, మిత భోజనం, పరిశుభ్రతను పాటించాలని, తద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చు అన్నారు. పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న మరుగుజ్జు పేద విద్యార్థిని యాస్మిన్ శరీర పెరుగుదల కోసం వైద్య పరీక్షల కోసం డాక్టర్ చేకూరి కోదండ రామానాయుడు ఆర్థిక సహాయం అందజేస్తానని ముందుకొచ్చి మానవత్వం చాటుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కే వాగ్దేవి మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబంలో జన్మించి, ఉన్నత విద్యను అభ్యసించి వైద్యులుగా ఇతర దేశాలలో స్థిరపడిన డాక్టర్ చేకూరు కోదండ రామానాయుడును ఆదర్శవంతంగా తీసుకొని విద్యార్థులు చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో చేకూరి జనార్ధన్ చౌదరి, హనుమంత నాయుడు,ఉపాధ్యాయులు దొడ్డ ఉమామహేశ్వర్, ఐ వెంకట్రామయ్య పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను పరిష్కరించండి : కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

బాధ్యతతో ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, వాటిని పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమంలో సుమారు 49 మంది సమస్యలతో కూడిన వినతులను కమిషనర్ కి అందజేశారు. తమ వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ ఆర్.సి. మునికష్ణ, అనిల్ కుమార్ కమిషనర్‌కు వినతులు సమర్పించారు. ఇందులో ముఖ్యంగా తమకు టీ.డి.ఆర్.బాండ్లు ఇప్పించాలని, పారిశుద్ధ్య పనులు మెరుగ్గా చేపట్టాలని, అర్హులైన వారికి పింఛన్లు ఇప్పించాలని, తమ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని రక్షణ కల్పించాలని ఉన్నాయి. అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, రెవెన్యూ ఆఫీసర్స్ సేతుమాధవ్ ఉన్నారు.

పంట బీమాను సద్వినియోగం చేసుకోవాలి: ఏవో భారతి

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ

పంట బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో భారతి సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సోమ వారం జంబు గోళం, గోవిందప్ప నాయుడు కండ్రిగ, పంచాయతీల్లో పొలాల్లోకి వెళ్లి వరద నష్టానికి నష్టపోయిన రైతుల పంట పొలాలను పరిశీలించారు. ఏవో మాట్లాడుతూ వరి పైరు నాటిన 45 రోజుల్లోపు పంట నష్టం జరిగితే ప్రభుత్వం వరి విత్తనాలు మాత్రమే రైతులకు సబ్సిడీగా ఇస్తుందని, ప్రభుత్వం ఇచ్చిన రకమే ఈక్రాప్ నమోదు చేయాలన్నారు. రబి 2024-25 సీజనుకు పంట ఇన్సూరెన్సు సంబంధించి వరికి ప్రీమియం రూ.630ను డిసెంబర్ 31, వేరుశనగకు రూ. 450 డిసెంబర్ 15లోగా ప్రీమియం చెల్లించాలన్నారు. సిఎస్సి సెంటర్లో రైతులు క్రాఫ్ ఇన్సూరెన్స్ నమోదు చేసుకోవాలన్నారు.

భువనేశ్వరపురం రోడ్డు ఆక్రమణలు పరిశీలన

ప్రజాశక్తి -రామచంద్రపురం

ప్రజా అవసరాలకు ఉపయోగిస్తున్న రహదారులను ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసిల్దార్ కే వెంకటరమణ హెచ్చరించారు. సోమవారం మండలంలోని గోకులాపురం గ్రామం నుండి భువనేశ్వరపురానికి వెళ్లే రహదారిని గ్రామానికి చెందిన కొర్లకుంట సుబ్బారెడ్డి ఆక్రమించుకున్నారని పి జి ఆర్ ఎస్ లో వచ్చిన ఫిర్యాదు పై రెవెన్యూ అధికారులు పరిశీలించారు. అనుపల్లి రెవిన్యూ లెక్క దాకలలో సర్వే నెంబరు 50/1 నందు భువనేశ్వర్ పురం కు (చెరువు కాడ ఇండ్లకు) వెళ్లేందుకు గతంలో వెడల్పైన రహదారి ఉండేది. ఆ రహదారికి ఇరువైపులా ఆక్రమణకు గురికావడంతో వాహనాల రాకపోకలకు ప్రజలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. రోడ్డు ఆక్రమణలను తొలగించాలంటూ అక్టోబర్ 28వ



తారీఖున పి జి ఆర్ ఎస్ కార్యక్రమం నందు భువనేశ్వరపురం గ్రామస్తులు, వ్యవసాయ పొలాలు కలిగిన రైతులు జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు పై తహసిల్దార్ కే వెంకటరమణ, సర్వేయర్ మణి, వీఆర్వో,లు రోడ్డును సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలంటూ ఆక్రమణదారులైన కే సుబ్బారెడ్డి, కే రామచంద్రారెడ్డి, కే కోదండరెడ్లను ఆదేశించారు. భువనేశ్వరపురం వెళ్లే రహదారి సమస్యను పరిష్కరించినందుకు రైతులు, గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

బాల్య వివాహాలను అరికట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి తిరుపతి టౌన్ తిరుపతి జిల్లా కలెక్టరేట్లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశ మందిరంలో ఆదివాసి అభివద్ధి సంస్థ, స్వచ్ఛంద సంస్థల ద్వారా ముద్రించిన బాల్య వివాహాల నిర్మూలన గోడ పత్రికను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులు, ఎన్ జి ఓ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెసి శుభం బన్సల్, జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, డిఎంహెచ్ఓ శ్రీహరి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి సూర్య నారాయణ, ఆదివాసి అభివద్ధి సంస్థ అధ్యక్షులు చందమామ కోటయ్య, పరివర్తన స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పి అమర్నాథ్, హెల్పింగ్ హాండ్స్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఎం దొరస్వామి పాల్గొన్నారు.

రేపు మార్చి నెల కోటా విడుదల

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన సుప్రభాతం, తోమల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవల 2025 మార్చి నెల కోటాను డిసెంబరు 18న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవాటికెట్ల రిజిస్ట్రేషన్ కోసం డిసెంబరు 18 నుండి 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన వారు డిసెంబరు 20 నుండి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయి. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్లను డిసెంబరు 21న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన మార్చి నెల కోటాను డిసెంబరు 21న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను డిసెంబరు 23న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. శ్రీవాణి ట్రస్టు టికెట్లకు సంబంధించిన మార్చి నెల ఆన్ లైన్ కోటాను డిసెంబరు 23వ తేదీ ఉదయం 11 గంటలకు టీటీడీ విడుదల చేయనుంది. వయోవద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా మార్చి నెల ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను డిసెంబరు 23న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను డిసెంబరు 24న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. మార్చి నెల గదుల కోటాను డిసెంబరు 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. డిసెంబరు 27న మార్చి నెల శ్రీవారి సేవ కోట విడుదల చేస్తారు.

నేడు పెన్షనర్ల దినోత్సవం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ఈ నెల 17 వ తేదీ జాతీయ పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం తిరుపతి నగర శాఖ ఆధ్వర్యంలో యల్ఐసి రోడ్ లోని వారి భవనంలో 75 సంవత్స రాలు నిండిన సంఘం లోని సభ్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించ నున్నట్లు సంఘం అధ్యక్షులు ఆర్. శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు ఆరని శ్రీనివాసులు ,ఖజానా శాఖ డైరెక్టర్ యన్.మోహనరావు పాల్గొంటారని తెలిపారు.

బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయండి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖలో బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని బంజారా జన్ సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షులు మూడే హరి చౌహాన్ నాయక్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం మంత్రి కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందించారు.

ప్రైవేట్ లా కాలేజీపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ పరిధిలోని ఈశ్వర్ రెడ్డి ప్రైవేట్ లా కాలేజీ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి నియమ నిబంధనలను పాటించకుండా అక్రమాలకు అన్యాయాలకు కేరాఫ్ అడ్రస్ గా నిర్వహించబడుతుందని ఆరోపించారు. సోమవారం ఎస్ వి యు రిజిస్ట్రార్ కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎటువంటి నాణ్యత ప్రమాణాలు లేని అధ్యాపకులుచే తరగతులకు హాజరు కాని విద్యార్థులకు అధిక డబ్బులు తీసుకొని హాజరు వేయడం, విద్యార్థుల నుండి అధిక మొత్తంలో అక్రమ వసూళ్లకు పాల్పడడం జరుగుతోందన్నారు. ఇలాంటివి కట్టకపోతే విద్యార్థులను పరీక్షలకు అనుమతించం అని మానసిక వేదనలకు గురిచేయడం వంటి అనేక అరాచకాలు ప్రైవేట్ లా కాలేజ్ లో జరుగుతూ ఉన్నాయని చెప్పారు. వెంటనే వాటిపై విచారణ చేసి చర్యలు తీసుకొని, కళాశాల అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అడ్వకేట్ నిదానం కోటేశ్వరరావు, మహేష్ , రఘు తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్



నిషేధిత అటవీ ప్రాంతంలో స్మగ్లర్ అరెస్ట్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

శేషాచలం అటవీ పరిధి అన్నమయ్య జిల్లా సరిహద్దులోని నిషేధిత అటవీ ప్రాంతంలో ఒక స్మగ్లర్ను అదుపులోకి తీసుకొని 6 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్సు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా చెయ్యేరు నదీ ప్రాంతంలో కడప సబ్ కంట్రోల్ సానిపాయ బేస్ ఆర్ఐ చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ వై.విశ్వనాథ్ బందం ఆదివారం నుంచి జాండ్రపెంట ఎఫ్బీవో కలసి గుర్రపు బాట తూర్పు వైపున గల చెయ్యేరు వైపు కూంబింగ్ చేపట్టారు. సోమవారం తెల్లవారు జామున వీరు మేకల కోన వద్దకు చేరుకోగా అక్కడ కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళు తూ కనిపించగా వారిని చుట్టుముట్టేందుకు ప్రయత్నించామన్నారు. వారు దుంగలు పడేసి పారిపోతుండగా వెంటబడి వారిలో ఒకరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ ఘటనపై తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అధికారులు తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

ప్రజాశక్తి - కెవిబిపురం

మండలంలోని తిమ్మసముద్రం గ్రామ సమీపంలో ఉన్న అమ్మవారి చెరువు కింద ఉన్న సాగునీటి విద్యుత్తు ట్రాన్స్ఫార్మర్‌ను దొంగలు బీభత్సం సష్టించి అర్ధరాత్రి ఎత్తుకెళ్లారని రైతులు బొర్రా శేఖర్ రెడ్డి, బొర్రా కుమార్ రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఓబులయ్య ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

ఆటో దొంగలు అరెస్ట్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

పార్కింగ్ చేసి ఉన్న ఆటోలను చోరి చేసే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ చిన్న పెద్దయ్య తెలిపారు. స్థానిక క్రైమ్ పోలీస్ స్టేషనులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోడూరు మండలానికి చెందిన దొడ్డ కార్తీక్ (23), తిరుపతికి చెందిన లలిత్ కుమార్ (20) ఇద్దరు స్నేహితులు. జల్సాలకు అలవాటు పడి ఖర్చులు నిమిత్తం ఆటోలను చోరీ చేసేవారు. వీరిపై నిఘా ఉంచిన పోలీసులు తిరుపతి రామానుజ పల్లి చెక్‌పోస్టు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వీరిని అదుపులో తీసుకున్నారు. వారు వద్ద నుంచి ఆరు లక్షల రూపాయలు విలువ చేసే నాలుగు ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించమని వెల్లడించారు.

అక్రమంగా ఈచర్‌లో రేషన్ బియ్యం తరలింపు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

రూరల్ మండలం రంజిత్ దాబా సమీపంలో పుత్తూరు మీదుగా తిరుపతికి అక్రమంగా ఈచర్ వాహనంలో 450 బస్తాల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఉదయం ఈచర్ లారీని సివిల్ పోలీసు స్పెషల్ స్క్వాడ్‌లు స్వాధీనం చేసుకున్నాయి. దాదాపు 25 టన్నుల బియ్యం ఉంటుందని అంచనా. ఈచర్ వాహనాన్ని బియ్యంతో సహా పుత్తూరు పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీంతో రేషన్ షాపు యజమానుల్లో గుబులు నెలకొంది.



గూడూరు 7వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
E.P.NO. 91 / 2022, O.S. NO. 16/2018

1. పోతిరెడ్డి నవీన్ రెడ్డి మరియు 4 వగైరాలు ....DHRs

Vs

ముక్కాల వెంకటసుమన్ ....JDR,

నోటీసు

To. ముక్కాల వెంకట సుమన్,
S/o వెంకటేశ్వర్లు, 9-56, పెల్లేటి వారి వీధి,
తూర్పు గూడూరు, గూడూరు టౌన్, తిరుపతి జిల్లా.

పైన నెంబరులోని DHRs వాళ్ళ డిక్రీ బాకీ రాబట్టుకొను నిమిత్తం పై నెంబరు E.P షెడ్యూలు ఆస్తిని వేలం వేయమని కోరుచూ పై నెంబరు E.P దాఖలు చేసినందున JDR నోటీసుకు గాను తేది.04-01-2025న వాయిదా వేసియున్నారు. కావున పై వేలం నోటీసు విషయమై JDRకు ఎలాంటి ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టు ఎదుట పై తేదిన ఉదయం 10.30 గం॥లకు హాజరై తెలుపుకోవలసినది లేని యెడల ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.

ఇట్లు,
టి. రఘురామిరెడ్డి,
DHRs **తరపున న్యాయవాది, గూడూరు.**

In the Court of the Principal Junior Civil Judge : Gudur
O.S.No. 314 / 2023

Aduri Ramanamma - Plaintiff

Vs

Sk.Usman - Defendant

Notice to Defendant

Sk.Usman,
S/o **Abubakkar,**
residing at Old AVR Function Hall,
Opp:Skanda Hospital, Srikalahasti Road,
Naidupet Town & Mandal,
Tirupati District.

పై నెంబరున వాది మీ నుండి ప్రామిసరి నోటు బాకీ రాబట్టుకొనుటకు పై తెలిపిన కోర్టులో మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే07-01-2025ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

వనం ప్రసాద్, ఎల్.ఎల్.ఎం.,
వాది తరపు అడ్వకేట్, గూడూరు.

IN THE COURT OF THE CIVIL JUDGE (JUNIOR DIVISON) NAGARI
O.E.P No.12/2023
O.S.No.26/2018

BETWEEN:
A.Narasaiah Decree holder
And:
A.Anantha Narasimhan (Died) his L.R'S Judgment debtors

Notice under order 21 Rule 34.C.P.C

To,
A.Harsha Bala, W/o Late Sathyanarayana, D.No-12/64/10, Swamy street, Extension, Puttur Town & Municipality, Tirupathi Dist, A.P.

In the above E.P.No.12/2023 in O.S.No.26/2018, Decree holder have filed E.P For Execution of sale deed of the E.P. Schedule property , the same is notice to you, Please to take that notice, that the above case is posted for the same on 31-12-2024 for your notice before the Hon'ble Junior civil judge court Nagari at 10.30 A.M. either in person or through an your advocate, failed to attend before court on the said date by you or your advocate , the matter will be decided in your obscene.

By Order of Court
K.Chandra Sekhar Reddy,
P.Chiranjeevulu,
Advocate,
Advocates for DHR

మహారాజశ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P.No. 63/ 2022, (Gajuvaka)
O.S. No. 308 / 2019

అట్ల పద్మ **....DHr,**

V/s

పుచ్చకట్ల వెంకట వంశీ మల్లిఖార్జున **....JDr,**

పైన తెలుపబడిన కోర్టు నందు DHr తనకు రావలసిన డిక్రీ వసూలు నిమిత్తం E.P షెడ్యూలు దాఖల ఆస్తిని వేలం వేసి డిక్రీ బాకీ వసూలు చేయమని కోరుతూ E.P దాఖలు చేసి ఉన్నది. కావున ఈ క్రింది కనబరిచిన E.P దాఖల షెడ్యూలు ఆస్తిని 1-2-2025 తేదిన పై కోర్టు నందు ఉదయం 10.30 నిమిషాలకు వేలం వేయుదురు. కావున ఆసక్తి గల పాటదారుల ఆరోజు వేలం పాటలో పాల్గొనవలసిందిగా కోరడమైనది. ఇది కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం జారీ చేయబడినది.

E.P షెడ్యూలు ఆస్తి వివరములు

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ప్రస్తుతం తిరుపతి జిల్లా, తిరుపతి రిజిస్ట్రేషన్ జిల్లా గూడూరు మండలం నిందూరు గ్రామ పంచాయతీ మరియు గ్రామం సర్వే.నెంబరు 485 విస్తీర్ణం :-1-00(ఒక ఎకరా) ఎకరా మెట్టభూమి దానికి హద్దులు:
తూర్పు : అట్ల రాధయ్య భూమి
దక్షిణం : భీమవరం మస్తానమ్మ భూమి,
పడమర : గొర్తల శ్రీనివాసులు భూమి,
ఉత్తరం : గొర్తల శ్రీనివాసులు భూమి,
DHr Value : 26,00,000/-
Amina Value: 27,00,00/-

ఇట్లు
DHr తరపు న్యాయవాది
కందనూరు వెంకట కృష్ణయ్య
అడ్వకేట్, గూడూరు.
సెల్ :9440113977.

శ్రీ నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 93 / 2023

Mylam Sakunthalamma ....వాది

V/s

AnnaReddy Nageswarmma and 8 Others .... ప్రతివాదులు

నోటీసు

టు
D2: షేక్‌జమీలా, W/o షేక్ జిలానీ, ముస్లీం వయస్సు 62 సం॥, సనత్‌నగర్, రేణిగుంట, తిరుపతి జిల్లా.
D3: ఉచ్చూరు కోటరెడ్డి, W/o లేట్ వెంకట సుబ్బారెడ్డి, హిందు, వయస్సు 58 సం॥, R/s రామాపురం గ్రామం, శ్రీసిటి హాస్పిటల దగ్గర తమిళనాడు.
D4: కె. భవాని, W/o మునిరత్నం నాయుడు, హిందు, వయస్సు 61 సం॥, R/s రామాపురం గ్రామం, శ్రీసిటి హాస్పిటల దగ్గర తమిళనాడు.
D5: జక్కంరెడ్డి భాస్కర్ రెడ్డి, S/o లేట్ ముద్దు క్రిష్ణరెడ్డి, హిందు వయస్సు 65 సం॥, గూడూరు టౌన్, తిరుపతి జిల్లా.

ఇందుమూలంగా మీకు తెలియ జేయడం ఏమనగా పై నంబరు కేసులో వాది మీ పైన పై వారి కోర్టులో Declaration title and consequntial permanent injuction In O.S. No.93/2023 లో దావా దాఖలు చేసివున్నారు. సదరు కోర్టు వారు సదరు దావా సమన్లు పలుమార్లు మీకు పంపిన జారీ కానందున పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తం పై కేసును వాయిదా తేది 30-12-2024న వేసివున్నారు. కావున మీరు ఆ రోజు ఉదయం 10.30 ని॥లకు హాజరై మీకు గల అభ్యతరం తెలుపుకొనవచ్చును. లేనిచో మీ పరోక్షమున అభ్యంతరం లేదని పై కేసును ఆక్షేపణలు లేవని కోర్టు తీర్మానించెదరు.

ఇట్లు
ఆశ చెంచుక్రిష్ణయ్య, బి.కాం, బి.ఎల్.,
కె. నిత్య, బి.ఎస్సీ, ఎల్ఎల్.బి,
వాది తరపున న్యాయవాదులు
నాయుడుపేట.

కొనసాగుతున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ దీక్షలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్

గూడూరు డిపో పరిధిలోకండక్టర్, డ్రైవర్ల అక్రమ సస్పెన్షన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహారదీక్ష సోమవారానికి ఐదో రోజుకు చేరుకుంది. దీక్షల్లో ఎస్‌ఎస్‌వి కృష్ణ, ఎ.అయ్య పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను అందరికీ సమానంగా అమలు చేయాలని, ఏకపక్షంగా డిఎం వ్యవహరిస్తున్నారని అన్నారు. డిపో దగ్గర నుంచి ర్యాలీగా బయల్దేరి సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సి.హెచ్.రాము, కె.ఎస్.మస్తాం, డి.శ్రీధర్, ఎం. శేషయ్య, జి.వెన్నెల, కే. రమణయ్య, కే.కష్టయ్య పాల్గొన్నారు.

కుట్టుమిషన్ వితరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్

గూడూరు పట్టణంలోని ప్రగతి సేవ సంస్థ కార్యాలయం నందు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో కుట్టు మిషన్‌ను మహిళకు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మయూరి శ్యామ్ యాదవ్ పాల్గొన్నారు. కడి వేటి చంద్ర శేఖర్ మాట్లాడుతూ తమ అబ్బాయి పుట్టినరోజు సందర్భంగా ఈ సేవా కార్యక్రమం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సేవా సంస్థ సభ్యులు శ్రీనివాసులు, రవి, కె ఆర్ ఎం, ప్రభాకర్, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి : ఎంఎల్‌ఎ

గూడూరు టౌన్ : నూతనంగా ఎన్నికైన సాగునీటి సంఘాల కమిటీలు రైతుల సమస్యలు పరిష్కరించేలా కృషి చేయాలని ఎంఎల్‌ఎ పాశం సునీల్‌కుమార్ డిమాండ్ చేశారు. అన్ని ప్రాంతాల్లోనూ ఏకగ్రీవం కావడం సంతోషంగా ఉందన్నారు. గూడూరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎంఎల్‌ఎ సునీల్‌కుమార్‌ను సత్కరించారు.

జాతీయస్థాయి జంప్ రోప్ పోటీలకు మంగళం విద్యార్థులు

ప్రజాశక్తి–తిరుపతి (మంగళం):

మంగళం పరిధిలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్లస్ (మంగళం ట్రెండ్స్) ముగ్గురు విద్యార్థులు జాతీయస్థాయి జంప్ రోప్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవులు నాయుడు తెలిపారు. ఈ మేరకు సత్యసాయి జిల్లా కదిరి విజ్ఞాన్ స్కూల్లో ఆదివారం రాష్ట్రస్థాయి ఐదవ జూనియర్ అంతర్ జిల్లా ఛాంపియన్షిప్ పోటీలు నిర్వహించారన్నారు. మంగళం ప్రాంగణంలోని ఇంటర్ కళాశాలలో చదువుతున్న రమ్యశ్రీ, 8వ తరగతి విద్యార్థి కోకిల రెడ్డి, 6వ తరగతి విద్యార్థి సుకన్య స్వర్ణ పతకాలు సాధించారన్నారు. 8వ తరగతి విద్యార్థి భవ్య వైష్ణవి, 6వ తరగతికి చెందిన కీర్తిక, చక్రవర్తి, విహిత్ లు కాంస్య పతకాలను సాధించారన్నారని వ్యాయామ ఉపాధ్యాయులు సాంబశివరావు, రామకృష్ణ తెలిపారు.

ముగిసిన ఎడ్యుకేషన్ ఫెయిర్

ప్రజాశక్తి–తిరుపతి (మంగళం)


రెండు రోజులపాటు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఫౌండేషన్ ఫర్ యూత్ అడ్వాన్స్మెంట్ వారు నిర్వహించిన ఎడ్యుకేషన్ ఫెయిర్ సోమవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ముఖ్యఅతిథిగా హాజరై ఎడ్యుకేషన్ ఫెయిర్ ద్వారా విశ్వవిద్యాలయాల ప్రతినిధులు విద్యార్థులకు కోర్సులను వివరించే తీరును పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో విద్య, క్రీడలపై ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షులు తూపల్లి నందకిషోర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్లు వాసుదేవరెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ పాల్గొన్నారు.

నాగరాజుకు డివైన్ తాంత్రిగా అవార్డు

ప్రజాశక్తి తిరుపతి సిటీ పుదుచ్చేరి వేదికగా 3వ ఇంటర్నేషనల్ హిందూ టెంపుల్స్ అండ్ స్పిరిట్యువల్ ఆస్ట్రాలజర్స్ కాన్ఫరెన్స్ ఈనెల 15వ తేదీన ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తిరుపతికి చెందిన నాగరాజుకు డివైన్ తాంత్రిగా అవార్డు అందుకున్నారు. ఈ మేరకు ఇంటర్నేషనల్ హిందూ టెంపుల్స్ అండ్ స్పిరియావల్ ఆస్ట్రాలజర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ జె. నరసింహ స్వామి విశ్వనాథన్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు.

అక్రమ గ్రావెల్ తరలింపు అరికట్టండి

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి)



చంద్రగిరి గ్రామ లెక్కదాఖలా సర్వే నెంబర్ 1479లోని పత్తిగుట్టలో సుమారు 3 ఎకరాల్లో అక్రమంగా(గ్రావెల్) సహజ సంపదను దోచేస్తున్నారని, దానిని అరికట్టాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతమాకుల పుణ్యమూర్తి అన్నారు. సోమవారం సంఘం నాయకులతో కలిసి చంద్రగిరి తాశీల్దార్ శివరామ సుబ్బయ్యను, సీఐ సుబ్బరామిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గత కొంతకాలంగా పత్తిగుట్టను అక్రమార్కులు కొల్లగొట్టుతున్నా రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ అధికారులు స్పందించక పోవడం బాధాకరమన్నారు. భారీ యంత్రాలతో ఇష్టానుసారంగా తవ్వకాలు చేస్తున్నా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇలాగే కొనసాగితే చెరువులు, గుట్టలు, కొండలు కనుమరుగవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ పక్క మట్టిని తరలిస్తూ, మరొక పక్క ఆ స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నాలు జరుపుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ అధికారులు ఏర్పాటు చేసిన సూచిక బోర్డు కూడా తొలగించి గ్రావెల్ ని తరలిస్తున్నారంటే ఆశ్చర్యం కలుగుతుందన్నారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోకపోతే జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ను ఆశ్రయిస్తామని పుణ్యమూర్తి హెచ్చరించారు.

జాతీయ కరాటే పోటీల్లో సత్యవేడు సత్తా

ప్రజాశక్తి - సత్యవేడు

ఐసిఎస్సి, కర్ణాటక ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించిన రెండవ జాతీయ కరాటే పోటీల్లో పతకాలతో సత్యవేడు కరాటే విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్ పట్టణంలో ఇండియన్ కౌన్సిల్ ఫర్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్, కర్ణాటక ప్రభుత్వం డిసెంబర్ 15వ తేదీ ఆదివారం నాడు రెండవ జాతీయ కరాటే పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఆంధ్ర రాష్ట్రం తరపున తిరుపతి జిల్లా సత్యవేడు కరాటే విద్యార్థులు పాల్గొని అండర్ 12 విభాగంలో ఈ.యోసేపు బంగారు పతకాన్ని సాధించి మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఎన్. దితేష్ కుమార్ ,జి.యోజిత్ సిల్వర్ పతకాన్ని సాధించి రెండవ స్థానంలో నిలిచారు. అలాగే అండర్ 14లో కె సిండ్రిల్లా మొదటి స్థానాన్ని, ఈ.జాకాబ్ రెండవ స్థానాన్ని, అండర్ 18లో జి.ధనుష్ మొదటి స్థానాన్ని, వి.భవశ్రీ రెండవ స్థానాన్ని,అండర్ 20 లో కే.ధనుష్ మొదటి స్థానాన్ని ఎస్.లీక్షిత రెండవ స్థానం పి సాగర్ మూడో స్థానాన్ని, అండర్ 25 విభాగంలో ఎస్ సర్జున సిల్వర్ పతకాన్ని పొంది రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ ఎంపి భాస్కర్, ఎం మదన్, హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

అందుబాటులో ఆన్లైన్ మార్కెటింగ్

ప్రజాశక్తి - సత్యవేడు

స్వయం సహాయక సంఘాలు ఉత్పత్తి చేస్తున్న సరుకులకు సంబంధించి ఆన్లైన్ మార్కెటింగ్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి జిల్లా సత్యవేడు గ్రామీణ అభివృద్ధి సంస్థ(వెలుగు) కోఆర్డినేటర్ శివకుమార్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక శ్రీశక్తి భవనంలో గ్రామ సంఘం అధ్యక్షుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిసి శివకుమార్ మాట్లాడుతూ మార్కెటింగ్ కోసం ముందుగా ఆన్లైన్లో రిజిస్టర్ చేసుకోవాల్సి ఉందన్నారు. ఒకసారి ఆన్లైన్ మార్కెటింగ్ లో ప్రవేశిస్తే సరుకు విక్రయాలు పెరుగుతుందన్నారు. అలాగే ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ రుణాలు కోసం సంబంధిత వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 35 శాతం సబ్సిడీతో ఈ పథకంలో రుణం మంజూరు అవుతుందన్నారు. ఈ సమావేశంలో వెలుగు కోఆర్డినేటర్ పయని, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు కోటీశ్వరి, అకౌంటెంట్ కాంచన పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్ పంపిణీ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా (యూఎస్ఏ) ఏకం వారి ఆర్థిక సహకారంతో సోషల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో తిరుపతి గ్రామీణ మండలాల పరిధిలో సిర్డ్స్ సంస్థ ద్వారా శిక్షణ పొందిన మహిళలకు టైలరింగ్ మిషన్లను పంపిణీ చేశామని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ డైరెక్టర్ శోభన్ బాబు తెలిపారు. మారుతున్న కాలానుగుణంగా ఫ్యాషన్ డిజైన్ పై గ్రామీణ మహిళలు పట్టు సాధిస్తూ ఆర్థిక చైతన్య వంతులుగా ఎదగాలని పిడి సూచించారు. జన శిక్షణా సంస్థ డైరెక్టర్ డాక్టర్ మోహన్ మాట్లాడుతూ ఏకం యూఎస్ఏ వారి సహకారంతో కుట్టుమిషన్ తీసుకున్న మహిళలందరూ ఆర్థికంగా బలపడాలన్నారు. ఈ కార్యక్రమంలో మాస్ సంస్థ అధ్యక్షులు జ్ఞానశేఖర్ రెడ్డి, సిర్డ్స్ సంస్థ కార్యదర్శి హేమశేఖర్, డిఆర్డిఏ ఏపీడీ డాక్టర్ ప్రభావతి పాల్గొన్నారు.



పంచాయతీ భవనం పునాదులకే పరిమితం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

మండలంలోని అతి పెద్ద పంచాయతీ అయిన తడుకులో పంచాయతీ భవనం పునాదులకే పరిమితమయ్యింది. దాదాపు 14 గ్రామాలకు ఈపంచాయతీ భవనం కేంద్ర బిందువు. దాదాపు 79.30 లక్షలతో అక్టోబర్, 2020లో భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. అయితే పునాదులు వేసి నాలుగేళ్లయినా నేటికీ భవన నిర్మాణ పనులు పూర్తికాకపోవడం గమనార్హం. అధికారులు ఈ భవన నిర్మాణాన్ని గాలికొదిలేయడంతో, ఇరుకైన భవనంలో 15 మంది సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రజలకు కనీసం కూర్చునేందుకు వీలు లేక పోవడం గమనార్హం. ఇకనైనా అధికారులు స్పందించి భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరుతున్నారు.

'సాగరమాల'కు ఆటంకం కలిగించొద్దు

ప్రజాశక్తి - కోట

సాగరమాల రోడ్డు నిర్మాణం కొరకు కేటాయించిన పలువురు రైతుల భూములకు సంబందించిన నష్ట పరిహారంను అందేలా న్యాయం చేస్తామని కోట తహసీల్దార్ కే.జె జె రావు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం కోట మండలంలోని ఊనుగుంటపాలెం గ్రామంలోని పలువురు రైతులతో తహసీల్దార్ పలు విషయాలపై చర్చించారు. అంతేకాకుండా సాగరమాల రోడ్డు నిర్మాణంలో ఎలాంటి ఆటంకాలు చేయకుండా ఉండాలన్నారు. అర్హులైన రైతులకు ప్రభుత్వం నుండి వచ్చే నష్ట పరిహారం అందేలా చూస్తామని రైతులకు హామీ ఇచ్చారు. వి ఆర్ ఓ చిరంజీవి, మండల సర్వేయర్ గోపిరెడ్డి పాల్గొన్నారు.

డొమెస్టిక్ ఐటి హెల్ప్ డెస్క్ శిక్షణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

పట్టణంలోని స్థానిక పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్ లో డొమెస్టిక్ ఐ టి హెల్ప్ డెస్క్ అటెండెంట్ శిక్షణను ఉచితంగా తీసుకుని, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి తెలిపారు. ఈ అవకాశంను నియోజకవర్గంలోని నిరుద్యోగులు సద్వినియోగం.చేసుకోవాలన్నారు. అయితే పదవ తరగతి నుంచి డిగ్రీ చదివిన నిరుద్యోగులు ఈ శిక్షణ తీసుకోవచ్చన్నారు. శిక్షణ అనంతరం ధృవీకరణ పత్రం ఇస్తామన్నారు.రిజిస్ట్రేషన్ కోసం ఎస్. రసూల్ చరవాణి నెంబర్ 6300954441 ను సంప్రదించాలన్నారు.

కరెంట్ షార్ట్ సర్క్యూట్ బాధితురాలికి రూ.10 వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-నాయుడుపేట తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం పండ్లూరు గ్రామంలో ఇటీవల కరెంట్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు దగ్ధమై నిరాశ్రయులైన సంధి.రాజేశ్వరికి సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ సోమవారం 10 వేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా బాధితురాలు ఎమ్మెల్యేకు కతజ్ఞతలు తెలియజేశారు.

శ్రీ ధర్మరాజుల ఆలయంలో తిరుప్పావై ప్రవచనాలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

పుత్తూరులోని శ్రీ ద్రౌపదీ దేవి సమేత శ్రీ ధర్మరాజుల దేవస్థానం ఆవరణలో డిసెంబర్ 16 వతేది సోమవారం నుంచి 2025 జనవరి 13 వ తేది వరకు టిటిడి వారి ఆళ్వార్ దివ్య ప్రభంద ప్రాజెక్టు వారి సౌజన్యంతో ధనుర్మాసం సందర్భాన్ని పురస్కరించుకొని శ్రీ గోదాదేవితిరుప్పావై ప్రవచనాలు నిర్వహిస్తున్నామని కోవిల్ కార్ సాళ్వాకం కష్టప్ప మొదలి, సాళ్వాకం ఏలుమలై మొదలి తెలిపారు.

నేషనల్ కర్రసాము విజేతలకు అభినందనలు

ప్రజాశక్తి-నాయుడుపేట

నేషనల్ కర్రసాము చాంపియన్ షిప్ 2024 పోటీలలో ఉత్తమ ప్రతిభను కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులను నాయుడుపేట ఎల్.ఏ సాగరం జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు అన్నామణి ఆధ్వర్యంలో అభినందించారు. ఈనెల 15వ తేదీన నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన నేషనల్ కర్ర సాము ఛాంపియన్ షిప్ 2024 లో ఎల్ ఏ సాగరం జడ్పీ హైస్కూల్ కు చెందిన విద్యార్థులు కె. హర్ష సిల్వర్ మెడల్, ఏ.చక్రి శ్రీనివాస్ సిల్వర్ మెడల్, బి. గుణ వర్ధన్ బ్రాంజ్ మెడల్ సాధించారు.

ఆర్కాట్ కృష్ణప్రసాద్‌కు బలిజబంధు అవార్డు ప్రదానం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ తిరుపతి రామాపురం రోడ్డు సందలి గల నిషాల్ కన్వెన్షన్ నందు బలిజ అభ్యుదయ సేవాసమితి (బాస్) ఆధ్వర్యంలో ప్రముఖ బలిజ మాజీ ఐఎఎస్ అధికారుల నేతృత్వంలో నిర్వహింపబడే విశ్వ సమాఖ్య వారు బలిజ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి శాసనసభ్యులు అరణి శ్రీనివాసులు మాట్లాడుతూ బలిజ పేద విద్యార్థులకు స్కాలర్ షిప్ లను అందజేశారు. ఆర్కాట్ కృష్ణప్రసాద్‌కు బలిజబంధు అవార్డును ప్రదానం చేశారు.

